# నాణానికి మరోవైపు

-కోసూరి శ్రీదేవి

సౌందర్యమంతా ఒక్కచోటే కుప్పగా పోశారేమో అన్నట్టు ఉంది ఆమె. అందాలెన్ని రకాలో ఉన్నాయి. వెర్రెక్కించే అందం, మత్తెక్కించే అందం, పిచ్చెక్కించే అందం, ఉక్కిరిబిక్కిరి చేసే అందం. కానీ నేను చూస్తున్నది మరో అద్భుతాన్ని. పున్నమి రోజుల్లో, నిశి వేళలో గోదారి ఎదపై పరుచుకున్న వెన్నెల్లా ప్రశాంతంగా ఎంతో హాయిగా ఉంది ఈమె అందం.

లేత తమలపాకులాంటి వెళ్ళు, పైట చాటున పొంగిన గుండ్రని అందాలు, సన్నటి నాజూకైన ఆ కోలమొహం, నల్లని కళ్ళు, సహజత్వం తొంగి చూస్తున్న మృదువైన నవ్వు అప్పుడే తలంటు పోసుకుందేమో నీరు పీల్చుకోవడానికి తువ్వాలు తోచుట్టి ముడి పెట్టిన జుట్టు, నుదుట కుంకుమ చుక్క... మార్వెలెస్.

''పోస్ట్....పోస్ట్''

రెండవసారి పోస్ట్‌మేన్ పెట్టిన అరుపుతో రాస్తున్న కథని ఆపి ఈలోకంలోకి వచ్చింది కాత్యాయిని. ఏదో ఎన్వలప్ కవర్.

అడ్రస్ నన్ను ఉద్దేశించి వ్రాసి ఉంది. శ్రీమతి కాత్యాయిని వైఫాఫ్ కృష్ణమూర్తి. నేను పంపిన కథకి ఏమైనా ప్రైజ్‌మనీ ఏమో ఆ ఆలోచన మనసులోకి రావటంతో మరింత ఆతృతతో కవరు చింపి చదవసాగింది.

తీరాచూస్తే పూర్వ విద్యార్థులకు కళాశాల వార్షికోత్సవానికి ఆహ్వానం పలుకుతూ పంపిన ఇన్విటేషన్ పేపర్. అన్నింటికన్నా ముఖ్యంగా ఆమెని ఆకర్షించింది... ప్రఖ్యాత రచయిత దివాకర్‌చే బహుమతి ప్రదానం అన్న విషయం.

ఫంక్షన్ మీద అంత ఇంట్రెస్ట్ లేకపోయినా తన అభిమాన రచయితని చూడటానికైనా వెళ్లాలనుకుంది. ఫంక్షన్ జరిగే తేదీ కోసం వెదికింది.

'అరే రేపేనే, సాయంత్రం ఐదు గంటలకు. శ్రీవారు చూస్తే క్యాంపు కెళ్ళారు. అయితే ఏం లే. రేపు వెళ్ళాలి'

కవరు మడతపెట్టి భద్రంగా దాచింది.

రాస్తున్న కథని పూర్తి చేయటానికి ఉపక్రమించింది.

కానీ ఆలోచనలకి బ్రేక్ పడటం వల్ల కలం ముందుకు సాగనని మొరాయిస్తుంటే కథ ప్రక్కన పెట్టింది.

★★★

మర్నాడు సాయంత్రం నాలుగు గంటలకే ముస్తాబై బయలుదేరింది.

ఈ బస్సులోకటి, మావారి బుర్రలాగే ఒక్కటీ ఖాళీగా ఉండి చావవు. వస్తే పోవు, పోతేరావు విసుక్కుంటూ టైము చూసింది. ఐదు దాటటంతో అక్కడ వెయిట్ చేయలేక ఆటో ఎక్కింది.

''ఇక్కడే, ఇక్కడే...ఆపు బాబు'' మీటర్ చూసి ఛార్జీ పే చేసి లోనికి బయలుదేరింది.

శారదా మహిళా డిగ్రీ కళాశాల. అంతా కోలాహలంగా ఉంది. ఆడపిల్లలందరూ రంగురంగుల సీతాకోక చిలుకల్లా అటు ఇటూ తిరుగుతున్నారు. ఫంక్షన్ స్టార్టయింది. ఛైర్స్ అన్నీ ఫుల్లు అయ్యాయి. ఎవరో ప్లేస్ ఇస్తే కూర్చుంది.

''ఇప్పుడు ప్రఖ్యాత స్త్రీవాద రచయిత శ్రీ దివాకర్ గారు ప్రసంగిస్తారు'' ఎనౌన్స్‌మెంట్ వినపడటంతో మనసులోని ఆలోచనలన్నీ వేదిక వైపుతిప్పింది కాత్యాయిని.

గౌరవ వాచకాలన్నీ పూర్తి చేశాడు.

ఆ కాలేజీ అమ్మాయిల గురించి ఉద్దేశించి ప్రసంగిస్తూ

''మనం ఉదయం లేచిన దగ్గర్నుంచీ ఎన్నో వార్తలు వింటున్నాం. పేపరులో ఏ కార్నర్ వెదికినా చీరకు నిప్పంటుకుని చనిపోయిందనో, స్టౌపేలి చనిపోయిందనో లేక కడుపు నొప్పి తాళలేక చనిపోయిందనో రాసని వార్తలే కనిపిస్తుంటాయి. మీరూ గమనించే ఉంటారు. అన్ బిలీవ్‌బుల్ కదూ. అన్ని చావులకీ ఒకటే రీజన్ ఎందుకవుతుంది. అమ్మాయిలూ....మీరూ ఆలోచించండి...దీనికంతా కారణం ఏమిటి? ఆర్థికపరమైన స్వార్థం. కట్నదాహం. ఈ చావులన్నీ ఆత్మహత్యల మాస్క్ వేసుకుని బయటపడుతున్న హత్యలు. ఇవన్నీ సమసిపోవాలంటే మన వ్యవస్థమారాలి. మారాల్సింది మీరు. ఈ వ్యవస్థ కాదు. కట్నం అడిగిన వాడిని కాల్చి పారేయండి. లేదా అలాంటివాడిని ఏ అమ్మాయి చేసుకోకుండా సోషల్ బాయ్‌కట్......''

చప్పట్ల హోరులో మిగతా ఉపన్యాసం వినపడలేదు. ప్రసంగం తర్వాత బహుమతి ప్రదానం జరిగింది. సాంస్కృతిక కార్యక్రమాలు మొదలయ్యాయి.

ఆటోగ్రాఫ్‌ల బెడద ఉంటుందనేమో ముందే బయలుదేరాడు దివాకర్.

''అరే బయలుదేరేరే. ఆయనతో చాలా మాట్లాడాలి'' పరుగులాంటి నడకతో బయటపడింది కాత్యాయిని.

★★★

''దివాకర్ గారూ...దివాకర్ గారూ''

ఆగాడు. కానీ ఆ కళ్ళు ఎవరు ఈ అమ్మాయి అని ప్రశ్నిస్తున్నట్టున్నాయి.

''నా పేరు కాత్యాయిని. మీ అభిమానిని. మీకు ఉత్తరాలు రాసిన కాత్యాయినీ ని.''

''ఓ మీరేనా..మీ ఉత్తరాలు నాకెంతో స్ఫూర్తినిస్తుంటాయి. మిమ్మల్ని ఈరోజు ఇలా చూస్తున్నందుకు చాలా..చాలా ఆనందంగా ఉంది. పదండి అలా నడుస్తూ మాట్లాడుకుందాం.''

''మీరు లేటెస్ట్‌గా రాసిన ఆడది అబల కాదు అన్న కథని చదివాను. ఎంత బాగా రాశారండి'' ప్రశంసించింది.

''అవునండీ ఆ కథకి మొన్న ఉగాది కథల పోటీల్లో బహుమతి కూడా వచ్చింది.''

''మా ఆడవాళ్ళ సమస్యలకి మీరు చాలా చక్కని పరిష్కారాన్ని సూచిస్తున్నారు. మా మహిళాలోకాన్ని ఉద్ధరించటానికి విచ్చేసిన జూనియర్ చలం మీరేనండీ.''

''మీరు నన్ను మరీ పొగుడ్తున్నారు. నేను మగాడ్నే అయినా మా వాళ్ళలోని పురుషాహంకారాన్ని మాత్రం సహించను. నిజం చెప్తే సెల్ఫ్ చెప్పుకున్నట్టవుతుంది. నేను పూర్తిగా స్త్రీల పక్షమే వహిస్తాను'' అన్నాడు నవ్వుతూ.

''బాబూ ధర్మం చెయ్యి బాబూ, పుణ్యం ఉంటుంది.'' బిచ్చగత్తె అర్థింపు వినపడటంతో అటువైపు చూశారిద్దరూ.

''పోమ్మా...చిల్లర్లేదు'' విసుక్కున్నాడు..

''బాబూ, పసిబిడ్డ బాబూ...ఆకలికి ఆగలేక ఏడుస్తోంది. ధర్మం పెబువులు, దానం సెయ్యయ్యా'' జాలిగా అడిగింది.

''వెధవ సంతని..వెధవ సంత...చిల్లర్లేదు అని చెప్పుంటే నీక్కాదూ..అవతలకి ఫో'' విదిలించాడు.

కాత్యాయిని కళ్ళల్లో కొద్దిగా విస్మయం. రూపాయి తీసి ఆమెకిచ్చింది.

''ఏంటండీ మీరలా దానికి డబ్బులిచ్చారు. ముష్టి...వొళ్ళొంచి పనిచేసి ఛావలేరు. వీళ్ళందరికీ ఇలా

దానం చేస్తూ పోతే కొన్నాళ్ళకి మనం అడుక్కోవాలి''

ఆమె కళ్ళల్లో చెప్పలేని ఆశ్చర్యం. మరో క్రొత్తవ్యక్తిని చూస్తున్నట్టు చూసింది.

★★★

''మీకు పెళ్ళయిందా?'' మాట మార్చింది.


''ఇద్దరు పిల్లలు కూడా'' జవాబిచ్చాడు.

''అదృష్టవంతులు''

''ఏం అదృష్టమోలెండి. ఇద్దరూ ఆడపిల్లలన్నే కన్న దౌర్భాగ్యుడ్ని.''

''అదేంటండీ అలా అంటారు'' మరింత ఆశ్చర్యంగా.

''మరెలా అన నండీ. రేపువాళ్ళకి కట్నాలివ్వాలంటే డబ్బులు ఎక్కడ్నుంచీ వస్తాయండీ. కడుపులో ఉన్నప్పుడు అబార్షన్ చేయించుకోవే అంటే ఇది విని ఛావలా. చస్తానని బెదిరించింది. ఇప్పుడు నేను చస్తున్నా.''



తన్నుకొస్తున్న కోపాన్ని తమాయించుకుంది కాత్యాయిని.

బస్‌స్టాండు రావటంతో ఇద్దరూ బస్సు ఎక్కారు. చాలా రద్దీగా ఉండటంతో తోసుకుని ఎక్కాల్సి వచ్చింది. ఒకే ఒక్కసీటు ఖాళీగా ఉంది. తిన్నగా వెళ్ళి సీటు ఆక్రమించాడు. అదీ లేడీస్ సీటు.

''మళ్ళీ కలుద్దాం'' ఒక నవ్వేటి ఆమె మొహాన పారేస్తూ.

మర్యాద కోసమైనా ఆమెని కూర్చోమని అనని ఆ రచయితని చూస్తే అంతవరకూ ఉన్న అభిమానం అంతా కొట్టుకుపోయింది ఆమెకు.

★★★

నిన్న జరిగిన విషయాన్ని తల్చుకుంటుంటే ఒళ్ళు మండిపోతోంది ఆమెకు. మనుషులందరూ ఇంతేనేమో. ఈడియట్ పైగా వెధవ కోతలొకటి. ఆశయాలు రాతల్లో తప్ప చేతల్లో చూపని దౌర్భాగ్యుడు. పైగా స్త్రీవాదంట.

అసహనంగా అటూ ఇటూ పచార్లు చేసింది. ఒక నిర్ణయానికొచ్చినట్టు లెటర్ పాడ్ తీసి రాయటం ప్రారంభించింది.

★★★

ప్రఖ్యాత స్త్రీవాద రచయిత దివాకర్‌కు-

మొదటిసారిగా ''నిన్ను'' అని సంబోధిస్తున్నాను. ఎందుకంటే నిన్ను గౌరవించాలంటే మనస్కరించటం లేదు.

నువ్వేదో అభ్యుదయవాది, ఆదర్శమూర్తివి అని అనుకుంటున్నావేమో. దయచేసి అలాంటి ఆలోచనల్లోంచి బయటపడు. శతకోటి మనుషుల్లో నువ్వూ ఒకడివి. పెద్ద పుణ్య పురుషుడివేం కాదు. అనవసరంగా నిన్ను చలంగారితో పోల్చి ఆయన పరువు తీశాను.

దీనుల గాథల్ని అద్భుతంగా చిత్రించే నీకు బిచ్చగత్తె ముష్టి... అయింది. కట్నం అడిగిన వాళ్ళని కాల్చిపారేయ్ అని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చిన నువ్వు ఆడపిల్లలని కనడం దౌర్భాగ్యం అనుకున్నావు. భార్యని కూడా గౌరవించలేని నువ్వు నిజంగా దౌర్భాగ్యుడివే.

ఆఖరికి బస్సులో సీటు కూడా ఆఫర్ చేయలేని నువ్వు స్త్రీవాదివి కాదు. అవకాశవాదివి.

మానవత్వం లేని నువ్వు రచయితవి ఎలా అయ్యావో తెలియటం లేదు. నీ వెనుక ఎవరైనా ఘోస్ట్ రైటర్ ఉన్నారేమో అనిపిస్తుంది.

నీలాంటి వాళ్ళకి రచనలు చేసే అర్హత లేదు. ఆడపిల్లల్ని కంటమే దౌర్భాగ్యం అనుకునే నీలాంటి వాళ్ళకు మా ఆడవాళ్ళ పేరెత్తే అర్హతే లేదు. మా ఆడవాళ్ళ సమస్యల గురించి నీకెందుకంత బాధ. పబ్లిసిటీ కోసమా, లేక పూటగడవటానికి తిండి కోసమా. ఆ రెండిటి కోసమే అయితే, నీకు ఏమాత్రం సిగ్గు అనే పదానికి అర్థం తెలిసినా ఆ కలాన్ని అవతల పారేయ్. మా ఆడవాళ్ళని ఇలాగే బ్రతకనియ్యి. వెధవ రాతలు రాసి, వెధవ అభిప్రాయాలు మానెత్తిన రుద్దకు.

సెలవ్.

ఒకప్పటి
నీ అభిమాని
కాత్యాయిని.

ఉత్తరాన్ని మరోసారి చదివి కవర్‌లో పెట్టి పోస్ట్ చేయడానికి బయలుదేరింది కాత్యాయిని. అప్పుడుగానీ ఆమెకు రిలీఫ్‌గా లేదు.

★